గొప్ప వైద్య వేత్త డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి



డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న డాక్టర్ రణదీప్ గులేరియా, డాక్టర్ ద్వారకనాథ్‌రెడ్డి తదితరులు

నల్లకుంట, జూలై 2 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలో మూడు పద్మ అవార్డులను స్వీకరించిన తొలి వైద్యుడు, గొప్ప వైద్య వేత్త డాక్టర్ దువ్వూరి నాగేశ్వర్‌రెడ్డి అని పలువురు వక్తలు అభివర్ణించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) నార్త్ బ్రాంచ్ ఆధ్వర్యంలో 5వ ఐఎంఏ తెలంగాణ స్టేట్ కన్‌హ - 2025 కార్యక్రమంలో భాగంగా ప్రపంచ గ్యాస్ట్రో ఎంటరాలజీ, ఏఐజీ చైర్మన్ డాక్టర్ దువ్వూరి నాగేశ్వర్‌రెడ్డి దంపతులను బుధవారం నగరంలోని కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ఎయిమ్స్ న్యూఢిల్లీ మాజీ డైరెక్టర్ పద్మశ్రీ డాక్టర్ రణదీప్ గులేరియా, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ద్వారకనాథ్‌రెడ్డి హాజరై మాట్లాడారు. డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి తన వైద్య ప్రయాణంలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సి.సురేంద్రనాథ్, డాక్టర్ జి.ఆర్.గణేష్‌రావు, డాక్టర్ బి.సాయిసుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

11వ విడత ఆపరేషన్ ముస్కాన్ ప్రారంభం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీసీపీ సృజన, ఉన్నతాధికారులు

హైదరాబాద్ సిటీ, జూలై 2 (ఆంధ్రజ్యోతి): సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 11వ విడత ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాన్ని ప్రారంభించామని మహిళ, చిన్న పిల్లల రక్షణ విభాగం డీసీపీ కె.సృజన తెలిపారు. బుధవారం సైబరాబాద్ కమిషనరేట్‌లో చైల్డ్ ప్రొటెక్షన్ సెల్, పోలీసు ఉన్నతాధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ సృజన మాట్లాడుతూ కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు ప్రతి ఏటా జూలైలో ఆపరేషన్ ముస్కాన్‌ను పోలీసులు, చైల్డ్ ప్రొటెక్షన్ సెల్ అధికారులతో కలిసి చేపడుతున్నామని తెలిపారు. ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా జూలై 1 నుంచి 31 వరకు స్పెషల్ డ్రైవ్ చేపట్టి మహిళలు, చిన్నారులను అక్రమ రవాణా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు బాలకార్మికులను రక్షిస్తామని తెలిపారు. సమావేశంలో ఏసీపీ కె.సత్యనారాయణ, రంగారెడ్డి జిల్లా పిల్లల సంరక్షణ కమిటీ ప్రతినిధి కె.నాగేందర్‌రెడ్డి, మేడ్చల్ ప్రతినిధి రాజారెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి శ్రీలతతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

'సిగాచి యాజమాన్యం పై చర్యలు తీసుకోవాలి'

హైదరాబాద్ సిటీ, జూలై 2 (ఆంధ్రజ్యోతి): కార్మికుల ప్రాణాలతో చెలగాటమాడిన సిగాచి యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని మానవ హక్కుల వేదిక హైదరాబాద్ యూనిట్ అధ్యక్షుడు సురేష్ బాబు డిమాండ్ చేశారు. సిగాచి ఫార్మా పరిశ్రమలో జరిగిన భారీ పేలుడు, తద్వారా జరిగిన తీవ్ర ప్రాణనష్టం పైన మానవ హక్కుల వేదిక బృందం బుధవారం నిజనిర్ధారణ జరిపింది. ఇంకా శవాల వెలికితీత పూర్తి కాకపోవడం, కంపెనీ పేరు తప్ప యాజమాన్యం పేర్లు ఇప్పటికీ బయటికి రాకపోవడం, మృతుల కుటుంబాలకు సమాచారం అందకపోవడం వంటి విషయాలు దిగ్భ్రాంతికి గురి చేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. నిజనిర్ధారణ బృందంలో మానవ హక్కుల వేదిక హైదరాబాద్ ఉపాధ్యక్షులు వెంకటనారాయణ, కమిటీ సభ్యులు వసంతలక్ష్మి, రోహిత్ ఉన్నారు.

'57 కులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి'

రాంనగర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): దళితులలో అత్యంత వెనుకబడిన ఎంబీసీ 57 కులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి, వెయ్యి కోట్ల బడ్జెట్ కేటాయించాలని 57 ఎంబీసీ కులాల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బైరి వెంకటేష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో తెలంగాణ మాల దాసరి కుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బైరి వెంకటేష్ మాట్లాడుతూ దళితులకు వచ్చే అన్ని ఫలాలు అట్టడుగున ఉన్న 57 కులాలకు కూడా దక్కాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర మాల దాసరి సంక్షేమ సంఘం అధ్యక్షుడు మల్లు ప్రసాద్, ప్రధాన కార్యదర్శి మద్దెల కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

'దేశ ప్రజల ప్రయోజనాలు ట్రంప్ వద్ద తాకట్టు'

హిమాయత్‌నగర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రజల ప్రయోజనాలను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దగ్గర మోదీ తాకట్టు పెట్టారని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలిఉల్లాఖాద్రీ, ప్రధాన కార్యదర్శి కల్లూర్ ధర్మేంద్ర ఆరోపించారు. అమెరికాలో నివసిస్తున్న భారతీయులపై దాడులు జరుగుతున్నా.. మోదీ పట్టించుకోవడంలేదని ఆరోపించారు. అమెరికాలో భారతీయులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం చలో అమెరికన్ కాన్సులేట్ కార్యక్రమాన్ని చేపట్టారు. హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్ నుంచి ప్రారంభమైన నిరసనను సమీపంలోనే అడ్డుకుని నేతలను అరెస్టు చేసి అఫ్జల్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నిరసన కార్యక్రమంలో సమాఖ్య నేతలు శ్రీనివాసులు, సల్మాన్‌బేగ్, కల్యాణ్, నాగరాజు, మధుకర్, సునీల్ పాల్గొన్నారు.


బీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదానికి కృషి చేయండి

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి ఎమ్మెల్సీ కవిత లేఖ

హైదరాబాద్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో బీసీలకు విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో 42శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించే బిల్లులకు రాష్ట్రపతి ఆమోదం దక్కేలా కృషి చేయాలని కోరుతూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావుకు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బుధవారం ఓ లేఖ రాశారు. రాష్ట్రపతి ఆమోదానికి బిల్లులు పంపి చాలాకాలం అవుతోందని, బీసీలకు రిజర్వేషన్లు కల్పించే బిల్లులకు ఆమోదం తెలిపేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే బాధ్యత తీసుకోవాలని విజ్ఞప్తిచేశారు.

స్పోర్ట్స్ పాలసీలో విజన్ కొరవడింది

- శాట్ మాజీ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త స్పోర్ట్స్ పాలసీలో విజన్ కొరవడి.. లోపభూయిష్టంగా ఉందని శాట్ మాజీ చైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి విమర్శించారు. బుధవారం అబిడ్స్‌లోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఒలింపిక్స్, ఆసియా క్రీడలు, కామన్వెల్త్ గేమ్స్ వంటి ప్రతిష్ఠాత్మక పోటీలకు క్రీడాకారులను సన్నద్ధం చేసేందుకు అవసరమైన హై పెర్ఫార్మన్స్ అకాడమీల స్థాపనపై నూతన క్రీడా విధానంలో కనీస ప్రస్తావన లేదని విస్మయం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో స్పోర్ట్స్ కోటా పెంపు, అంతర్జాతీయ పోటీల్లో పతకాలు నెగ్గిన వారికి ఇచ్చే ఉద్యోగాలపై పాలసీలో స్పష్టత ఇవ్వకపోవడాన్ని తప్పుబట్టారు. శాట్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కోచ్‌ల క్రమబద్ధీకరణ, కొత్త కోచ్‌ల నియామకాలపై ఎలాంటి ప్రకటన చేయకపోవడంపై కోచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. స్టేడియాలు, స్పోర్ట్స్ స్కూళ్ల ఆధునీకరణపై దృష్టి పెట్టాలని వెంకటేశ్వర్ రెడ్డి సూచించారు.

మణికొండలో రూ. కోటిన్నర విలువైన డ్రగ్స్ స్వాధీనం

- ఇద్దరు స్మగ్లర్స్ అరెస్ట్

నార్సింగ్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): మణికొండ మున్సిపాలిటీ వైఎస్ఆర్ కాలనీలో రూ. కోటిన్నర విలువైన 650 గ్రాముల హెరాయిన్ డ్రగ్స్, 84 గ్రాముల పాపీస్ట్రా మాదక ద్రవ్యాలను ఎస్‌వోటీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు స్మగ్లర్స్‌ను అరెస్టు చేశారు. పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. వైఎస్ఆర్ కాలనీలో నివాసం ఉంటున్న ఇద్దరు వ్యక్తుల వద్ద డ్రగ్స్ ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. శంషాబాద్ ఎస్‌వోటీ పోలీసులు ఆ ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా మాదక ద్రవ్యాలను రాజస్థాన్ నుంచి నగరానికి దిగుమతి చేసుకున్నట్లు తెపారు. విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.



వర్షం దాటికి బురదమయంగా మారిన ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల ప్రాంగణం



వర్షం నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు ఇబ్బందికరంగా మారిన రాజాడీలక్స్ చౌరస్తా రోడ్డు

ముసురుతో ఇబ్బందులు



తొందరగా రా..

ముషీరాబాద్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ఎడతెరపి లేకుండా బుధవారం తెల్లవారుజాము నుంచి కురుస్తున్న వర్షానికి ముషీరాబాద్ ప్రజలు ఇబ్బందులు పడ్డారు. చిరువ్యాపారులు, పాదచారులు, వాహనదారులు వర్షం వల్ల ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముషీరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణం వర్షం నీటికి బురదమయంగా మారింది. విద్యార్థులు, ఉపాధ్యాయులు తరగతి గదుల్లోకి వెళ్లడానికి తీవ్రఇబ్బందులు పడ్డారు. దాయారం మార్కెట్ చౌరస్తా నుంచి రాజాడీలక్స్ చౌరస్తా వరకు మంచినీటి పైప్‌లైన్ నిర్మాణ పనులు పూర్తిచేసి రోడ్డు వేయకుండా అలాగే వదిలేశారు. దీంతో తవ్విన చోట రోడ్డు కుంగి వర్షం నీళ్లు నిలిచిపోవడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడ్డారు. పార్శిగుట్ట చౌరస్తా, బాపూజీనగర్, వినోభానగర్ తదితర ప్రాంతాల ప్రజలు ముసురు వల్ల ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి



రోడ్డును పరిశీలిస్తున్న కార్పొరేటర్

రాంనగర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): రాంనగర్ డివిజన్‌లోని బాకారంలో జరిగే బోనాల పండగ సందర్భంగా దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు వెంటనే చేపట్టాలని కార్పొరేటర్ కె.రవిచారి జీహెచ్‌ఎంసీ అధికారులకు సూచించారు. బుధవారం డీఈ గీతతో కలిసి బస్తీలో ఆయన దెబ్బతిన్న రోడ్లను పరిశీలించారు. డీఈ గీత మాట్లాడుతూ రోడ్ల మరమ్మతు పనులు వెంటనే చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాంరెడ్డి, బస్తీవాసులు పాల్గొన్నారు.

లయన్స్ హైదరాబాద్ అధ్యక్షుడిగా ఈఎస్ఎస్ఎన్

రాంనగర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ అపూర్వ డిస్ట్రిక్ట్ 320 ఏ రీజియన్ 7 జోన్ 2 లయన్ స్టిక్ ఈయర్ 2025 నూతన అధ్యక్షుడిగా సమాజ సేవకుడు లయన్ డాక్టర్ ఈ.ఎస్.సూర్యనారాయణ ఎన్నికయ్యారు. బుధవారం జరిగిన క్లబ్ సమావేశంలో అధ్యక్ష ఎన్నికల్లో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికను లయన్ టి.నయనదేవి, ఎంజేఎఫ్ రిటైర్డ్ జాయింట్ కలెక్టర్, అపూర్వ క్లబ్ అధ్యక్షుడు వై.సుధాకర్‌రావు ప్రకటించారు. క్లబ్ కార్యదర్శిగా లయన్ మహేష్, కోశాధికారిగా లయన్ టి.నయనదేవిని కూడా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.


సచివాలయం ముట్టడి పోస్టర్ ఆవిష్కరణ

చిక్కడపల్లి, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ఈనెల 9న నిర్వహించబోయే సెక్రటేరియట్ ముట్టడిలో విద్యార్థి నిరుద్యోగులు పెద్దఎత్తున పాల్గొనాలని నిరుద్యోగ జేఏసీ నేతలు పిలుపునిచ్చారు. ఈ మేరకు ముట్టడికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను చిక్కడపల్లి సిటీసెంట్రల్‌లైబ్రరీ వద్ద బుధవారం ఆవిష్కరించారు. రాష్ట్రప్రభుత్వం జాబ్‌క్యాలెండర్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మోతీలాల్‌నాయక్, శంకర్‌నాయక్, కృష్ణ, వెంకటేష్, వీరేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మరాఠా మహాసంగ్ రజతోత్సవం

బర్కత్‌పుర జూలై 2(ఆంధ్రజ్యోతి): భారతీయ మరాఠా మహాసంగ్ రజతోత్సవం ఘనంగా జరిగింది. కాచిగూడలో బుధవారం రాత్రి జరిగిన ఈ వేడుకలకు మాజీ ఎంపీ బీబీ పాటిల్, సెంట్రల్ యూనివర్సిటీ వైస్‌చాన్సులర్ బీజే.రావు, భారతీయ మరాఠామహాసంగ్ జాతీయ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ గార్గే, రాష్ట్ర అధ్యక్షుడు సుదేష్ పాటిల్, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ దేశ్ పాండే, రాజన్, శ్రీరామ్ సిండే తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సేవా కార్యక్రమాల ద్వారా మరాఠాలు తమ ఐక్యతను చాటుకుంటున్నారని పేర్కొన్నారు. సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహాసంగ్‌నేతలు డాక్టర్ హూనం, బాజీరావు బోస్లే, మనోజ్, దత్తాత్రేయ రవికిరణ్, శ్రీధర్ లోకండే, సునీత తదితరులు పాల్గొన్నారు.

కల్లాస్ కంపెనీ ఎండీపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న బాధితులు

నల్లకుంట, జూలై 2 (ఆంధ్రజ్యోతి): పెట్టుబడి పేరిట అమాయక ప్రజలను మోసం చేస్తున్న వైజాగ్‌కు చెందిన కల్లాస్ కెమికల్స్ కంపెనీ ఎండీ సూర్యచంద్ర కల్లాపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని బాధితులు డిమాండ్ చేశారు. ఫ్లోర్ క్లీనింగ్ డిటర్జెంట్స్ ప్రొడక్ట్స్‌ను తక్కువ ధరకు అమ్ముతామని వాటిని మార్కెటింగ్ కూడా చేస్తామని ఆన్‌లైన్‌లో ప్రకటనలు ఇచ్చి మోసాలకు పాల్పడుతున్నారని వారు ఆరోపించారు. బుధవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధితులు విక్రమ్‌సింగ్, హనుమంతరావు మాట్లాడుతూ కంపెనీ ఎండీ మాటలు నమ్మి లక్షల్లో ఇన్వెస్ట్‌మెంట్ చేసి ప్రొడక్ట్స్‌ను కొనుగోలు చేస్తే నకిలీ ప్రొడక్ట్స్‌ను పంపించి తమను మోసం చేశారని వాపోయారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని నిలదీస్తే ప్రొడక్ట్స్‌ను రిటర్న్ తీసుకుని మూడు నెలల్లో డబ్బులు చెల్లిస్తామని మాయా మాటలుచెప్పి మోసాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ విషయంపై తాము చిక్కడపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని పోలీసులు కంపెనీ ఎండీ సూర్యచంద్ర కల్లాను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు పంపించారని వారన్నారు. అయితే బెయిల్‌పై విడుదలై తిరిగి అదే మోసాలకు పాల్పడుతున్నారని సుమారు 60 మంది వద్ద కోట్లలో డబ్బులు వసూలు చేశాడని ఆరోపించారు. ప్రజలు ఎవరు కూడా ఆ కంపెనీలో ఇన్వెస్ట్ చేయవద్దని వారు కోరారు. మోసాలకు పాల్పడుతున్న కంపెనీ ఎండీపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు



అంజయ్యనగర్‌లో రోడ్డు సమస్యను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గోపాల్

రాంనగర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): అడిక్‌మెట్ డివిజన్‌లోని అంజయ్యనగర్‌లో సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు చేపడతామని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ పేర్కొన్నారు. బుధవారం అధికారులు, స్థానికులతో కలిసి ఎమ్మెల్యే పాదయాత్ర చేశారు. రోడ్లు, డ్రైనేజీ, వర్షంనీటి సమస్యలను ఎమ్మెల్యేకు ప్రజలు విన్నవించారు. ఈ పనులు వెంటనే పూర్తి చేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ ప్రధానకార్యదర్శి కె.సురేందర్, నాయకులు చిట్టి, సత్యనారాయణ, అబ్బు, నేత శ్రీనివాస్, యూనస్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేయాలి



జోనల్ కమిషనర్ రవికిరణ్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న కార్పొరేటర్ పద్మ

రాంనగర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): బాగ్‌అంబర్‌పేటలో అభివృద్ధి పనులకు వెంటనే నిధులను విడుదల చేయాలని బుధవారం జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ రవికిరణ్‌కు కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్‌లోని భరత్‌నగర్, పోచమ్మబస్తీ, సంజయ్ గాంధీ ప్రాంతాల్లో కమ్యూనిటీ హాల్స్‌కు మరమ్మతులు చేపట్టాలని కోరారు. నందనవనం కాలనీ, సంజయ్‌నగర్‌లో సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరుచేయాలని కోరారు. ఈ మేరకు నిధుల విడుదలకు కృషి చేస్తామని జోనల్ కమిషనర్ హామీ ఇచ్చారని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బి.వెంకటరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు మిరియాల శ్రీనివాస్, గోవింద్ అర్జున్ తదితరులు పాల్గొన్నారు.



హైడ్రా మాన్‌సూన్ ఎమర్జెన్సీ టీమ్ చేపట్టిన పనులను పర్యవేక్షిస్తున్న గాంధీనగర్ కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్

హైడ్రా మాన్‌సూన్ టీమ్ పనుల పర్యవేక్షణ

చిక్కడపల్లి, జూలై 2 (ఆంధ్రజ్యోతి): హైడ్రా మాన్‌సూన్ ఎమర్జెన్సీ టీమ్ చేపట్టిన పనులను గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ బుధవారం పరిశీలించి పర్యవేక్షించారు. నగరంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా రోడ్లపై వరదనీరు నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారనే ఫిర్యాదు మేరకు కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ అశోక్‌నగర్, సిటీసెంట్రల్ లైబ్రరీలేన్, అశోక్‌నగర్ స్ట్రీట్‌నెంబర్ 1, 2 లలో పర్యటించారు. కార్పొరేటర్ సూచనల మేరకు అశోక్‌నగర్‌లో వరదనీటిని తొలగించేందుకు హైడ్రా మాన్‌సూన్ ఎమర్జెన్సీ టీమ్ పనులు నిర్వహించారు. జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ ఏఈ అబ్దుల్‌సలామ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్, బీజేపీ నేతలు వినయ్ కుమార్, శ్రీకాంత్, ఉమేష్, సురేందర్, సురేష్, ఆనంద్‌రావు, సాయికుమార్, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

5 నుంచి విద్యార్థి, నిరుద్యోగ మహాసభలు

చిక్కడపల్లి, జూలై 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం చట్టబద్ధంగా జాబ్‌క్యాలెండర్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో విద్యార్థి, నిరుద్యోగ మహాసభల కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నామని విద్యార్థి, నిరుద్యోగ సంఘం నేత జనార్దన్ తెలిపారు. ఈ మేరకు ఈనెల 5వ తేదీన సూర్యాపేట జిల్లాలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం చిక్కడపల్లిలోని సిటీసెంట్రల్ లైబ్రరీ ఆవరణలో విద్యార్థి, నిరుద్యోగసంఘం నేతలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేత బక్క జడ్సన్, నిరుద్యోగ, విద్యార్థి నేతలు ఇంద్రనాయక్, వెంకటేష్, నాగేష్, కృష్ణ, అస్మా, రాము పాల్గొన్నారు.

ఆలోకనం సాహిత్య విమర్శ గ్రంథావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న శ్రీధర్, ఇనాక్, జనార్దనమూర్తి

చిక్కడపల్లి, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ఇనాక్ సమగ్ర సాహితీ స్వరూపాన్ని ఆనందరావు తన ఆలోకనంలో విమర్శను అర్థవంతంగా చేశారని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ పూర్వ చైర్మన్ డా.అయాచితం శ్రీధర్ అన్నారు. త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రముఖ సాహితీవేత్త ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహితీ సప్తాహంలో భాగంగా బుధవారం డా. కల్లూరి ఆనందరావు రచించిన ఆలోకనం సాహితీ విమర్శ గ్రంథావిష్కరణ సభ గానసభ అధ్యక్షుడు కళాజనార్దన మూర్తి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన డా.అయాచితం శ్రీధర్ గ్రంథాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఆనందరావు తన విమర్శనాగ్రంథంలో దళిత అస్తిత్వంపై ఇనాక్ సాహితీ ఆలోకనంలో తరతరాలుగా బలహీనవర్గాలు ఎదుర్కొంటున్న వివక్షతను విశదీకరించారన్నారు. రచయితను పరిచయం చేసిన విద్యావేత్త డా.నందిరాజు కల్యాణి మాట్లాడుతూ ఆనందరావు విమర్శలు సహేతుకంగా ఉంటాయన్నారు. సంగీతగురువు సంయుక్త, గానసభ సంయుక్తకార్యదర్శి చక్రపాణి తదితరులు పాల్గొన్నారు. తొలుత సంయుక్త శిష్యబృందం అన్నమయ్య కీర్తనలను మధురంగా గానం చేశారు.



రామచందర్‌రావును సన్మానిస్తున్న బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి విజయలక్ష్మి

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం

చిక్కడపల్లి, జూలై 2 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎంపికైన ఎన్.రామచందర్‌రావును బ్రాహ్మణ ఐక్యవేదిక అధ్యక్షుడు డా.ఏవీఆర్ మూర్తి ఆధ్వర్యంలో బుధవారం ఐక్యవేదిక నేతలు సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా డా.ఏవీఆర్ మూర్తి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా రామచందర్‌రావు ఎంపిక కావడం బ్రాహ్మణులకే కాకుండా యావత్తు తెలంగాణకు సరైన నాయకుడిని అధిష్ఠానం ఎంపిక చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ ఐక్యవేదిక గౌరవాధ్యక్షుడు మురుకుంట్ల రాజేశ్వరశర్మ, కార్యనిర్వాహక అధ్యక్షుడు పోపూరి శ్రీనివాస్, ప్రధానకార్యదర్శి ఎంవీ సోమేశ్వర్లు, మురళీకృష్ణమాచార్యులు, సురేష్, శిరీష, శైలజ, సురేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

రాంనగర్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన ఎన్.రాంచందర్‌రావును హరియాణా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ కుమార్తె, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి బండారు విజయలక్ష్మి, బీజేవైఎం ముషీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్ ఎం.శ్యామ్, అడిక్‌మెట్ డివిజన్ బీజేపీ మాజీ అధ్యక్షుడు ఆర్.నరేష్, బీసీ సెల్ నగర నాయకుడు శ్రీకాంత్ తదితరులు సన్మానించారు. ఎన్.రాంచందర్‌రావును బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రొయ్యూరు శేషసాయి, బీజేపీ అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షుడు పాశం సాయికృష్ణయాదవ్ తదితరులు సన్మానించారు. ఎన్.రాంచందర్‌రావును బీజేపీ మహంకాళి జిల్లా కార్యవర్గ సభ్యులు కౌండిన్య ప్రసాద్ సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ఎన్.రాంచందర్‌రావును టీడీపీ రాష్ట్ర నాయకుడు నైషధం సత్యనారాయణమూర్తి సన్మానించారు.

నల్లకుంట: బీజేపీ రాష్ట్ర నూతన అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావును నల్లకుంట మాజీ కార్పొరేటర్ వనం రమేష్ తదితరులు శాలువాకప్పి సత్కరించారు.



రామచందర్‌రావును అభినందిస్తున్న ఐక్యవేదికనేతలు

స్వచ్ఛంద సంస్థలు పేద విద్యార్థులకు సహకరించాలి

నల్లకుంట, జూలై 2 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛంద సంస్థలు పేద విద్యార్థులకు పూర్తిస్థాయిలో సహకరించాలని దళిత సేన జాతీయ చైర్మన్ డాక్టర్ జేబీ.రాజు సూచించారు. ఉన్న అవకాశాలను పేదవిద్యార్థులు సద్వినియోగం చేసుకుని కష్టపడి చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని కోరారు. బుధవారం నల్లకుంట డివిజన్ సంజయ్ గాంధీనగర్ కమ్యూనిటీ హాల్‌లో రమాబాయి మహిళాసంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ రెడ్డిమల్ల పార్వతి ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు నోట్ బుక్స్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గంట మోహన్, డాక్టర్ గంట మల్లేష్, బి.లక్ష్మి, బాణయ్య తదితరులు పాల్గొన్నారు.

7న వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీ లెక్కింపు

చిక్కడపల్లి, జూలై 2 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 7న ఉదయం 10 గంటలకు హుండీ ఆదాయం లెక్కింపు ఉంటుందని దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్, దేవాలయం ఈవో అన్నపూర్ణ తెలిపారు. ఆసక్తిగల భక్తులు ఆలయ ప్రాంగణంలో నిర్వహించే ఈ లెక్కింపులో పాల్గొనాలని ఆమె బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ఆజామాబాద్ డివిజన్, హైదరాబాద్‌సిటీ-1 పరిధిలో గురువారం విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈలు నాగేశ్వరరావు, వినోద్‌కుమార్ తెలిపారు. పార్శిగుట్ట, హిమాయత్‌నగర్ పరిధుల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, సెవెన్‌టెంపుల్ పరిధిలో 12నుంచి 1 గంటవరకు, 44నెంబర్ బస్టాప్, ఏపీపీఎస్సీ పరిధుల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

పెండింగ్ డీఆర్‌లు, పీఆర్‌సీ అమలుచేయాలి

రాంనగర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పెన్షన్‌దారులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్ సమస్యలను పరిష్కరించడంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం మాదిరే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో రిటైర్డ్ ఉద్యోగులకు ఆరోగ్య పథకం(జీహెచ్ఎస్)పై చర్చించి ఆమోదించినా అమలుకు చర్యలు తీసుకోకపోవడం శోచనీయమన్నారు. పెండింగ్‌లో ఉన్న 4 డీఆర్‌లు వెంటనే విడుదల చేయాలని, పీఆర్‌సీ అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, పెంటయ్య, శరత్‌బాబు, శ్రీనివాస్‌రెడ్డి, సీతారామయ్య, ప్రభాకర్, విశ్వనాథ్, నర్సింహారావు పాల్గొన్నారు.

రైలు ప్రయాణికుడి సెల్‌ఫోన్ చోరీ

బర్కత్‌పుర, జూలై 2 (ఆంధ్రజ్యోతి): రైలు ప్రయాణికుడి సెల్‌ఫోన్‌ను దొంగ లాక్కొని పారిపోయాడు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన సురేష్‌దేశ్‌పాండే(35) కాచిగూడకు రావడానికి రేణిగుంట రైల్వే స్టేషన్‌లో చెంగల్‌పట్టు ఎక్స్‌ప్రెస్ రైల్వే ఎక్కాడు. తాడిపత్రి రైల్వే స్టేషన్ సమీపంలో రైలు స్లో కావడంతో సురేష్‌దేశ్‌పాండే చేతిలో ఉన్న సెల్‌ఫోన్‌ను ఓ దొంగ లాక్కొని పారిపోయాడు. బుధవారం బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని తదుపరి విచారణ నిమిత్తం గుత్తి రైల్వే పీఎస్‌కు బదిలీ చేసినట్లు సీఐ తెలిపారు.

న్యూజెర్సీలో ఎస్పీబీ మ్యూజిక్ అకాడమీ ప్రారంభం

చిక్కడపల్లి, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ప్రఖ్యాత గాయకులు, పద్మవిభూషణ్ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతిని పురస్కరించుకుని అమెరికా న్యూజెర్సీలో మంగళవారం ఎస్పీబీ మ్యూజిక్ అకాడమీని ప్రారంభించారు. ఆకట్టుకునేలా నృత్యప్రదర్శనలు, 35 మంది గాయనీగాయకులు, 8మంది టీనేజ్ గాయకులతో బాలు గానవిభావరిని నిర్వహించారు. అకాడమీ అధ్యక్షుడు శ్రీనివాస్ గూడూరు, సంస్థ ఉపాధ్యక్షుడు రాజేశ్వరి బుర్ర మాట్లాడుతూ అకాడమీ ద్వారా ప్రసిద్ధిచెందిన గాయకులు, సంగీత ఉపాధ్యాయులతో వర్క్‌షాప్‌లు, శిక్షణా కార్యక్రమాలు, ప్రతి ఏటా ఔత్సాహిక గాయకుల కోసం పాటలపోటీలు నిర్వహించడం, ఎస్పీబీ అవార్డ్స్ అందించడం వంటి కార్యక్రమాలు చేపడుతామన్నారు. న్యూజెర్సీ యుటిలిటీస్ కమిషనర్ చివుకుల ఉపేంద్ర, జర్నలిస్ట్ శ్రీధర్ చిల్లర, అకాడమీ చైర్మన్ డా.శ్రీహరి ఎప్పనాపల్లి, సలహాదారులు దాము గేదెల, డా.రవిఅయ్యగారి, సుజాత వెంపరాల, కుమార్‌రాణి, ప్రమోద్, రమాప్రభ, కుమార్‌బుధరాజు, శ్రీనివాస్ గనగోని, కిరణ్, విజయభాస్కర్, మధు, వెంకట తాతా తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం చిత్రపటాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

డెంగీ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

బర్కత్‌పుర, జూలై 2 (ఆంధ్రజ్యోతి): డెంగీ పట్ల ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమాదేవి కోరారు. వర్షాకాలం సందర్భంగా మురికినీరు వచ్చి దోమలు వృద్ధి చెంది మలేరియా, డెంగీ బారిన పడే ప్రమాదం ఉందన్నారు. దీంతో ప్రజలు అప్రమత్తతోనే ఈ వ్యాధులను నివారించవచ్చని పేర్కొన్నారు. బుధవారం యూపీఎస్‌టీ కోఠి జీహెచ్‌ఎంసీ సంయుక్త ఆధ్వర్యంలో కాచిగూడ డివిజన్ రహ్మత్‌బాగ్‌లో డెంగీ ఫీవర్‌పై ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్లపై మురికి చెత్తను ఎప్పటికప్పుడు తొలగించడమే కాకుండా మురికినీరు నిలువకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వసంతకుమార్, జయంతి, సునీల్‌రెడ్డి, బీఎస్.రాధ, శ్రీదేవి, బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, నాయకులు ఓంప్రకాష్, భీమ్‌రాజ్, రవియాదవ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి అంజిరెడ్డి : 99859 21362